సాక్షి చిత్తూరు

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



నీటి ఎద్దడి నివారణకు చర్యలు

జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆదేశించారు - 8లో



తరగతిలో 'హలో' ఏంటి?

తరగతి గదిలో మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధం విధిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	29	24
తిరుపతి	29	25
తిరుమల	24	21
గూడూరు	30	26
నగరి	30	28

న్యూస్‌రీల్

అర్ధగిరి ఆదాయం రూ.17.04 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.17,04,949 వచ్చినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. అర్ధగిరిక్షేత్రంలోని మండపంలో సోమవారం దేవదాయ శాఖ అధికారి శ్వేత, ఈఓ యువరాణి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ కానుకల ద్వారా 99 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు.

పరిశ్రమలకు కోతలు లేవు

చిత్తూరు కార్పొరేషన్: పరిశ్రమలకు విద్యుత్ కోతలు పూర్తిగా ఎత్తివేసినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 15 వరకు నిబంధనలతో కూడిన పవర్‌హాలిడేకు ఏపీఈఆర్సీ అనుమతులు ఇచ్చింది. అయితే విద్యుదుత్పత్తి అనూహ్యంగా పెరగడంతో కోతల్లేకుండా సరఫరా చేసేందుకు ఈఈ, డీఈ, ఏఈలకు ఆదేశాలు అందాయి

ఇద్దరు ఉప సర్పంచుల ఎన్నిక

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపసర్పంచుల ఎన్నిక ప్రక్రియను సోమవారం నిర్వహించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపసర్పంచులను వార్డు సభ్యులు చేతులు ఎత్తి ఎన్నుకున్నారు. ఐరాల మండలం ఎం.పైపల్లె పంచాయతీ ఉపసర్పంచ్‌గా 7వ వార్డు సభ్యుడు సి.జయచంద్ర, నింద్ర మండలం నెట్టేరి పంచాయతీ ఉపసర్పంచ్‌గా 3వ వార్డు సభ్యుడు పి.మోహన్‌బాబును ఎన్నుకున్నారు. బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ ఎంపిక మాత్రం కోరం లేకుండా వాయిదా పడింది. నివేదిక రాష్ట్ర అధికారులకు పంపించామని తదుపరి ఆదేశాలు వచ్చాక అక్కడ మరోమారు ఎన్నిక నిర్వహించనున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు.

నేడు అథ్లెటిక్ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో మంగళశారం అథ్లెటిక్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీల్లో అండర్14, 16, 18, 20, 23 బాల, బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఇందులో ఎంపికై నవారు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 86868 67079, 99667 99710ను సంప్రదించాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల నిర్వాహకులు, హెచ్‌ఎం లు సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు వివరాలు అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే ఏడాది ఏప్రిల్లో ఉంటాయని చెప్పారు. అపరాధ రుసుం లేకుండా వచ్చే నెల 15వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ప్రైవేట్ స్టడీ సెంటర్లలో అభ్యర్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

ఆరోగ్యంగా పసికందు



పలమనేరు: రెండ్రోజుల క్రితం పట్టణంలోని డ్రైనేజీలో లభ్యమై, ఆస్పత్రిలో చేరిన పసికందు ఆరోగ్యంగా ఉందని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర, సూపర్‌వైజర్ నజ్మా షేక్ తెలిపారు. ఆ మేరకు వారు చిత్తూరులోని జిల్లా ఆస్పత్రిలో న్యూ బార్న్ బేబీ యూనిట్‌లో చికిత్స పొందుతున్న పసికందును సోమవారం పరిశీలించారు. అక్కడే మరో నాలుగురోజుల పాటు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పాప ఆరోగ్యం మెరుగయ్యాక తిరుపతిలోని శిశు విహార్‌కు తరలించనున్నట్లు వారు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,459 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,899 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు హుండీలో రూ.4.05 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

మీరే మాస్టారు!

నవ సమాజ స్థాపనకు ఈ ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. విద్యాలయాలను దేవాలయాలుగా భావించారు. పచ్చదనం పెంచుతూ, శుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. నేటి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ వారిలో సరికొత్త ఆలోచనలకు భీజం వేస్తున్నారు. విద్యార్థులకు నైట్ విజన్ తరగతులు, బడుల ఆవరణలో మొక్కల పెంపకంతో పాటు మాతృభాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఎంతో సమయాన్ని, సొంత నిధులను వెచ్చిస్తున్నారు. ఇన్ని సేవలందించిన వీరు నేడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు.

- వినూత్న బోధనలతో రికార్డులు
- అవార్డులు స్వీకరించనున్న 62 మంది
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : ఆ ఉపాధ్యాయులు అందరిలా కాకుండా, వినూత్న ఆలోచనలతో తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారు పనిచేస్తున్న పాఠశాలల్లో మొక్కలు, ఆట వస్తువులతో ఆహ్లాదంగా మారుస్తున్నారు. మొత్తంగా సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యార్థులకు ప్రతి అంశం సులువుగా అర్థమయ్యేలా ప్రయోగాత్మకంగా బోధన చేస్తున్నారు. తమవంతు పాత్ర పోషిస్తూ ఆదర్శ గురువులుగా నిలుస్తున్నారు. మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం)ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఘనంగా జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఉత్తమ బోధనతో పాటు సేవారంగాల్లో ముందుంటున్న ముగ్గురు ఉపాధ్యాయులు విశాఖలో రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకోనున్నారు. ఇదే విధంగా జిల్లాలో 62 మంది గురువులు అవార్డులు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. దీనిపై డీఈవో విజయేంద్రరావు సోమవారం డీఈవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. నేటి అవార్డుల ప్రదానోత్సవానికి ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

తెలుగును ప్రేమించి... విద్యార్థులకు పంచి




పూతలపట్టు మండలం ఎం.బండపల్లి జెడ్పీ హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. తెలుగుభాషపై రచనా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. తెలుగు సబ్జెక్టులో ఒక బాలిక 100కి 99 మార్కులతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. పాఠశాలలో మొక్కలను నాటి పెంచుతున్నారు. ఈ సేవలకు గాను ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

శివలింగం.. ఆదర్శప్రాయం



జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా టి.శివలింగం ప్రస్థానం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఈయన వెదురుకుప్పం మండలం దేవళం పేట జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. ఏటా పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక టీఎల్‌ఎం, స్టడీ మెటీరియల్‌ను జిల్లా స్థాయిలో రూపొందిస్తారు. రాష్ట్ర స్థాయిలో అనేక వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. సబ్జెక్ట్ ఎక్స్‌పోర్ట్‌గా సేవలందించారు. పదవ తరగతి విద్యార్థులకు నైట్ విజన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.





గురుపూజోత్సవం ఏర్పాట్లపై సమావేశంలో చర్చిస్తున్న డీఈవో విజయేంద్రరావు

34 ఏళ్లుగా విశిష్ట సేవలు



బోధనలో నైపుణ్యం కలిగిన హెచ్‌ఎం ఎస్.మనోహర్ నాయుడి స్వగ్రామం నారాయణవనం మండలం అరణ్యం కండ్రిగ. ఈయన 1989లో ఎస్జీటీగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలలకు గంట ముందే వెళ్లడం, పాఠశాలల పనివేళల తరువాత గంట సమయం గడిపి పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. పాఠ్యాంశ బోధనను సులభతరం చేయడానికి నిరంతరం అధ్యయనం చేశారు. బడికి రాని విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు రప్పించడంలో సఫలమయ్యారు. ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న పాఠశాలలో బడిమానేసిన తొమ్మిదవ తరగతి విద్యార్థి ఇంటి ముందు దీక్ష చేసి బడికి వచ్చేలా చేశారు. ఇలా విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలకుగాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

రాష్ట్ర అవార్డులకు ముగ్గురు

జిల్లాలోని పాలసముద్రం మండలం ఎస్ఆర్ కండ్రిగ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మనోహర్ నాయుడు, నగరి మండలం నాగరాజకుప్పం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.పురుషోత్తమ ఆచారి, యాదమరి మండలం సిద్దారెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాల టీచర్ సి.ప్రమీళ కుమారికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి.

సొంత రచనలు



జిల్లాలోని పాకాల మండలం కొత్తపల్లె గ్రామంలో ధనలక్ష్మి, సుందరాచారి దంపతులకు మాలేపట్టు పురుషోత్తమ ఆచారి జన్మించారు. 1998 నుంచి తెలుగు టీచర్‌గా ఏకాంబరకుప్పం (నగరి మండలం), కొత్త ఆరూరు (నింద్ర) లలో పనిచేశారు. ప్రస్తుతం నగరి మండలం నాగరాజకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన సొంత నగదుతో ద్వాదశ పుస్తకాలను రచించి, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచి..



విద్యార్థుల మానసిక పరిస్థితి అంచనా వేసి, వినూత్న రీతిలో విద్యాబోధన చేసిన ప్రమీళ కుమారిని రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది. ఆమె 2007లో పూతలపట్టు మండలం బందార్లపల్లెలో చేరారు. ఆ సమయంలో 9 మంది ఉండగా, ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని 24 మంది విద్యార్థులను చేర్పి, ఆ బడి మూతపడకుండా చేశారు. నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షలకు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. 2015లో పెనుమూరు మండలం చిన్నకలికిరి పాఠశాలలో పనిచేసే సమయంలో 20 మంది విద్యార్థులుండగా, వారి సంఖ్యను 45కు పెంచేందుకు నిర్విరామ కృషి చేశారు. దాతల సహకారంతో ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు.


కాలేయ మార్పిడికి రూ.10 లక్షలు



హనీఫా కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : మున్సిపల్ పరిధి 5వ వార్డుకు చెందిన అబ్దుల్ బాషా కుమారుడు హనీఫా (45)కు కాలేయ మార్పిడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల ఎల్‌ఓసీని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సోమవారం అందజేశారు. 5వ వార్డుకు చెందిన హనీఫాకు ఇటీవల కాలేయ సంబంధిత వ్యాధి సోకడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తన కుమారుని పరిస్థితిని అబ్దుల్ భాషా మంత్రి ఆర్కేరోజాకు విన్నవించుకొని ఆర్థిక సాయం అందించాలని కోరాడు. వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కాలేయ మార్పిడి చికిత్స కోసం రూ.10 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. తన నివాస కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. వార్డు కౌన్సిలర్ దయానిధి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి ఓటర్ల సర్వే



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటింటి ఓటర్ల సర్వే సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల మేరకు కసరత్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 1737 పోలింగ్ స్టేషన్‌లుండగా 15,48,299 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. బోగస్, డూప్లికేట్, మృతి చెందిన ఓటర్లను క్షుణ్ణంగా పరిశీలించి తొలగిస్తున్నట్లు చెప్పారు. క్లెయిమ్, అభ్యంతరాల పరిశీలన అనంతరం ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30 వరకు 22,156 మంది నూతన ఓటర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. వారికి పీవీసీ ఎపిక్ ఓటరు కార్డులు ఇచ్చేందుకు ప్రింటింగ్ కు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అ'విశ్రాంత' గురువు

- నేటికీ అలుపెరుగని సేవలు
- ప్రతి ఫలం కాదు.. పిల్లల భవిష్యత్తే ధ్యేయం



తరగతి గదిలో బోధిస్తున్న శంకరయ్య

కార్వేటినగరం: ఆయన ఉద్యోగ విరమణ పొంది ఏడేళ్లయినా, నేటికీ రోజూ పాఠశాలకు వెళ్లి పిల్లలకు బోధిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిని గొప్పగా భావించారు. విరమణ పొందినా అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. ప్రతిఫలం ఆశించకుండా అవిశ్రాంత గురువుగా పేరు తెచ్చుకున్నారు. తన కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టిన చదువును పదిమందికీ పంచాలన్న ఉద్దేశంతో జీవితాన్ని బోధనకే అంకితం చేసేశారు. ఆయనే కార్వేటి నగరం మండలం పాదిరికుప్పానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శంకరయ్య. ఈయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 1981లో అప్పటి పలమనేరు సమితిగా ఉన్నప్పుడు మూట్లపల్లిలో విధుల్లో చేరారు. అక్కడి నుంచి కేశవకుప్పం, అన్నూరు, ఆలత్తూరు, జంగాలపల్లి, పొన్నగల్లు, జగన్నాథపురం పాఠశాలల్లో పని చేశారు. పదవీవిరమణ సమయంలో తన స్వగ్రామం పాదిరికుప్పంలో సేవలు అందించారు. 2017వ సంవత్సరం పదవీ విరమణ పొందారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా, కుమార్తె ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా స్థిపడ్డారు. తన జీవితం, కుటుంబం విద్య వల్ల ఉన్నత స్థాయికి ఎదిగిన విధంగానే గ్రామంలోని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని పరితపిస్తున్నారు. ఉద్యోగ విరమణ పొంది ఏడేళ్ల గడుస్తున్నా నేటికీ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠ్యంశాలు బోధిస్తూ ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా శ్రమిస్తున్న శంకరయ్యను స్థానికుందరూ కీర్తిస్తున్నారు. ప్రభుత్వం నుంచి లభించే పింఛన్‌తో జీవనం సాగిస్తున్న ఆయన కుటుంబ సభ్యులతో కాకుండా ఎక్కువ సమయం విద్యార్థులకే కేటాయించడం మరో విశేషం. బోధనలోనే అనిర్వచనీయమైన ఆనందం ఉంటుందని శంకరయ్య మాస్టారు అంటున్నారు.

నాలుగేళ్లుగా సెలవు పెట్టని టీచర్



జయలక్ష్మి

పలమనేరు: మండలంలోని సాకేవూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆర్ జయలక్ష్మి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈమె గత నాలుగేళ్లుగా ఆమె సెలవు పెట్టకుండా విధులు నిర్వర్తించారు. ఎంతో శ్రద్ధతో, పట్టుదలతోబాధ్యతలు నిర్వర్తించిన ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు.

హేమలతకు రాష్ట్ర స్థాయి అవార్డు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బయాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న హేమలత రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ విశాఖ పట్టణంలో మంగళవారం నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ఈ అవార్డు స్వీకరించున్నారు. కరోనా సమయంలో వ్యాధి నిరోధకతపై వీడియో పాఠాలతో అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం వర్క్‌బుక్స్, నీట్ మెటీరియల్, ఎంసెట్ ప్రశ్నావళిని సిద్ధం చేసి సర్కారు కళాశాలల్లో చదివే విద్యార్థులకు అందజేశారు.

'స్పందన' సమస్యలకు ప్రాధాన్యత

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో వచ్చే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు స్పందన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించి 319 అర్జీలు వచ్చాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. డీఆర్‌వో రాజశేఖర్ వినతులు స్వీకరించారు.

ఆత్మహత్యకు యత్నం

పొలానికి వెళ్లేందుకు దారి సౌకర్యం సమస్య పరిష్కరించాలంటూ పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన రైతు వెంకటస్వామి ఆత్మహత్యకు యత్నించారు. స్పందన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎదుట పురుగుల మందు తాగేందుకు యత్నించారు. వెంటనే అక్కడున్న అధికారులు, పోలీసులు ఆ రైతు నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కొన్నారు. అధికారులు ఆయన సమస్యను ఆరా తీశారు. దారి సమస్యను క్షేత్ర స్థాయిలో విచారించిన తరువాత న్యాయం చేస్తామని చెప్పడంతో ఆ రైతు స్వగ్రామానికి వెనుదిరిగారు.





స్పందనలో వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రిషాంత్‌రెడ్డి

- పెండింగ్ వేతనాలను చెల్లించాలని విజయ డెయిరీ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 11 నుంచి డెయిరీ ఎదుట నిరసన చేపడుతామని అందులో పేర్కొన్నారు.

స్పందన అర్జీలపై స్పందించాలి

చిత్తూరు అర్బన్: స్పందనలో ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా స్పందించాలని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని ఆర్మ్డు రిజర్వు పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్పీ, ఏఎస్పీలు ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 40 ఫిర్యాదులు రాగా ఇందులో మోసం 2, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదాలు 3, భర్త వేధింపులు 3, భూతగాదాలు 18, మిస్సింగ్ కేసు 1, దారి తగాదాలు 3, పోలీసుల సేవలు 4 చొప్పున వినతులు అందాయి. అనంతరం జిల్లాలోని పోలీసు స్టేషన్ల అధికారులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. స్పందనలో ప్రతి వారం వచ్చే ఫిర్యాదుల స్థితిపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రామాలయంలో గోమాత ప్రదక్షిణ


స్వామివారి సేవలో గోమాత

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములు గుడివీధిలోని శ్రీ కోదండరాముడిని సోమవారం ఓ గోమాత దర్శించుకుంది. తొలుత ఆ గోవు నేరుగా మూలస్థానంలోకి వెళ్లింది. అక్కడి అర్చకులు స్వామిపూజ చేసి గోమాతకు కర్పూర హారతి పట్టారు. అనంతరం అక్కడి నుంచి నెమ్మదిగా కదిలి అద్దాల మేడలోని రాములోరి ముందు నిలబడింది. ఆ తరువాత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వెళ్లిపోయింది. ఇలా ఆవు ఎప్పుడూ ఆలయంలోకి ప్రవేశించలేదని, ఇదే తొలిసారి అని అర్చకులు వేణు గోపాల్ వెల్లడించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జిల్లా అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం
- ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వేదికపై ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, హాజరైన అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి సమస్యలను జెడ్పీ స్టాండింగ్, సర్వసభ్య సమావేశంలో చర్చిస్తారని తెలిసినా పలువురు జిల్లా అధికారులు గైర్హాజరవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్వైవార్షిక పథకాల ద్వారా అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని వివరించారు. కొన్ని చోట్ల మిట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలు, వేరుశెనగ పంటకు నష్టం కలిగిందని దీనిపై వ్యవసాయశాఖ అధికారులు సమగ్రమైన సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల కల్పన ముమ్మరం చేయాలని సూచించారు. పెద్దపంజాణి మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు జరగడం లేదన్న ఫిర్యాదు వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో పీఆర్ ఎస్‌ఈ వెళ్లి పరిశీలించాలని, అక్టోబరు 30వ తేదీ లోపు ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

విజిలెన్స్ కమిటీల ఏర్పాటు

జిల్లా, మండల స్థాయిలో పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎఫ్‌పీ షాప్‌ల పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రతినెలా 15లోపు రేషన్‌కార్డుదారులకు బియ్యం అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 7న ఎంపీపీ, జెడ్పీటీసీలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పై చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో, ఈనెల 8న కాణిపాకంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. ఉలవలు, ఎరువులు ఆర్బీకేల్లో రాయితీ ద్వారా రైతులు పొందవచ్చని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి తెలిపారు. చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు వివరించారు. ఏనుగుల బారి నుంచి కాపాడేందుకు తగిన చర్యలు అటవీశాఖాధికారులు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వసతి గృహాల్లో నీటి సమస్యలను పరిష్కరించాలని వైస్ చైర్మన్ రమ్య అధికారులను కోరారు. ప్రతి నెలా రెండుసార్లు బాలికలు, గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య కిట్‌ను అందజేస్తున్నామని స్త్రీ సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి తెలిపారు. సత్యవేడు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయని జెడ్పీటీసీ తెలుపగా కొత్త భవనాల నిర్మాణాలకు నివేదిక పంపినట్లు ఆశాఖ పీడీ వివరించారు. సమావేశంలో ముందుగా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి కలెక్టర్, సీఈఓలను బ్రహ్మోత్సవాలకు రావాలని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు ఆహ్వానించారు. కార్యక్రమంలో అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,300
రిటైల్ వెండి గ్రాము	రూ.78.00

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం ఉపాధ్యక్షుడిగా భాస్కర్ రావు



యాదమరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన భాస్కర్ రావును ఎంపిక చేశారు. ఈ నెల 3వ తేదీ ఏలూరులోని రెవెన్యూ భవనంలో ఐదవ జోన్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల ఉపాధ్యక్షులుగా యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రావును ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. భాస్కర్‌రావు మాట్లాడుతూ హెచ్‌ఎంల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ఫుట్‌బాల్ పోటీల్లో సిద్ధంపల్లికి వెండి పతకం


వెండి పతకం సాధించిన విద్యార్థులు

చిత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి మినీ ఫుట్‌బాల్ పోటీల్లో సిద్ధంపల్లి జట్టు వెండి పతకం సాధించింది. ఈ మేరకు చిత్తూరు మండలం సిద్ధంపల్లి పీవీపీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విజేతలను అభినందించారు. పూతలపట్టు అన్నపూర్ణ మైదానంలో మినీ ఫుట్‌బాల్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. 13 జట్లు తలపడిన ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో సిద్ధంపల్లి జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. జాతీయ స్థాయి మినీ ఫుట్‌బాల్ టోర్నీకి ఈ పాఠశాల విద్యార్థులు తేజ, సచిన్ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

‘ఉలవలు తినేశారు’పై విచారణ


సాక్షి ఎఫెక్ట్..

వీఎస్‌ఏ పాపయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏడీఏలు శ్రీదేవి, శివకుమార్, మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కేశవరెడ్డి తదితరులు

చౌడేపల్లె: మండలంలో చేపట్టిన ఉలవల పంపిణీలో చోటుచేసుకున్న అవినీతిపై చిత్తూరు ఏడీఏ శ్రీదేవి విచారణ చేపట్టారు. సాక్షిలో గత నెల 31వ తేదీ ‘600 కిలోల ఉలవలు తినేశారు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వ్యవసాయశాఖ జేడీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు సోమవారం పుంగనూరు ఏడీఏ శివకుమార్‌తో కలిసి విచారణ చేపట్టారు. బయోమెట్రిక్ పద్ధతి ద్వారా రైతులకు ఉలవలు పంపిణీ చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఉలవలను రైతులకు పంపిణీ చేసినట్లు గుర్తించారు. రైతుల సంతకాలు కొందరివి ఒకరే ఫోర్జరీ చేసినట్లుగా ఉండడం, కొన్ని చోట్ల పంపిణీ రిజిస్టర్‌లో సంతకాలు లేకపోవడం గుర్తించారు. చారాల ఆర్‌బీకేలో 132 మంది రైతులకు 12 క్వింటాళ్ల ఉలవలు పంపిణీ చేసినట్లు రికార్డులో ఉండగా రైతుల నుంచి బయోమెట్రిక్ పద్ధతి ద్వారా కేవలం 14 మందికి పంపిణీ చేశారు. రైతుల నుంచి బయోమెట్రిక్ లేకుండా విత్తనాలు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వీఎస్‌ఏ పాపయ్య పనితీరుపై ఏడీఏ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌడేపల్లెలో 66 మంది రైతులకు 10.6 కింటాళ్ల పంపిణీ చేసినట్లు రికార్డులో ఉండగా 49 మందికి మాత్రమే బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేశారు. చారాలకురప్పల్లెకు చెందిన రమణవ్యాపారికి చౌడేపల్లె ఆర్‌బీకెలో ఉలవలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందని వీఏఏ హర్షద్‌ను ప్రశ్నించారు. పంపిణీలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. విచారణలో వెలుగుచూసిన వివరాలతో నివేదికలను జేడీకి అందజేస్తామన్నారు. ఆమె వెంట ఏఓలు శ్రీకాంత్, జ్యోతమ్మ ఉన్నారు.

పర్యవేక్షణకు ముగ్గురు ఉపాధ్యాయుల నియామకం

మండలంలోని చారాల ఉన్నత పాఠశాలలో సాంబారులో పడి చిన్నారికి గాయాలు శీర్షికన ఈనెల 3న కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో కేశవరెడ్డి గాయపడిన తన్మయిని ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం పర్యవేక్షణకు ముగ్గురు ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. వంట సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ వెంట సచివాలయ సిబ్బంది అనీషా, మణిమాల తదితరులున్నారు.

చిత్తూరు శిశువిహార్ బాలుడు ఆస్పత్రిలో కన్నుమూత

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని శిశువిహార్‌లో ఏడాదిన్నర వయస్సున్న మగ పిల్లాడు సోమవారం మృతి చెందాడు. అభాగ్యులు, అనాథలుగా ఉన్న పిల్లల్ని సంరక్షించడానికి చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ కూడలిలో శిశువిహార్ నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. ఆదివారం ఇక్కడున్న పిల్లాడికి జ్వరంగా ఉందని శిశువిహార్‌లో పనిచేసే సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం బాలుడు ఆస్పత్రిలోనే మృతి చెందాడు. శిశువిహార్ నిర్వాహకుల ఫిర్యాదుతో అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.



తరగతి గదిలో ‘హలో’ ఏంటి?



చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల


తరగతి గదిలో విద్యార్థులు

- పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం
- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ కమిషనర్
- డీఈవో, డీవైఈవో, ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు

చిత్తూరు కలెక్టరేట్ : దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్మితమవుతోంది. భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే. అయితే గురువులే క్రమశిక్షణ పాటించకపోతే విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుంది. స్మార్ట్‌ఫోన్ల రాకతో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పడం అటుంచి ఫోన్లలో మాట్లాడడం, ఆన్‌లైన్ చాటింగ్‌లతో బిజీగా ఉండడంతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి. తరగతి గదుల్లో టీచర్లు సెల్‌ఫోన్‌ల వినియోగంపై ఉన్నతాధికారులకు నిత్యం ఫిర్యాదులు అందేవి. ఆ పరిస్థితులను చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి పాఠశాలల్లో మొబైల్‌ఫోన్లను నిషేధిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్జేడీ, డీఈవో, డైట్ కళాశాల ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు.

బోధనకు ఆటంకం కలగకుండా....

జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బోధన సమయంలో ఎటువంటి ఆటంకం రాకుండా, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు పూర్తి ఏకాగ్రత పాఠ్యాంశాల మీదనే ఉంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మొబైల్ నిషేధం నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా వ్యక్తిగత అవసరాల కోసం మొబైల్ ఫోన్లు ఉపయోగిస్తూ బోధనా సమయాన్ని వృథా చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు వెళ్లాయి.

ఫోన్లతో నష్టపోతున్న విద్యార్థులు

భావిభారత పౌరులను తీర్చిదిద్దే తరగతి గది వాతావరణం ఎంత ప్రశాంతంగా ఉంటే బోధన, అభ్యసన ప్రక్రియ అంత సాఫీగా సాగుతుంది. అయితే ఇటీవల ఉపాధ్యాయులు బోధిస్తున్న సమయంలో మొబైల్ మోగడం, వెంటనే బయటకు వెళ్లడం, లేదా విద్యార్థులకు చదువుకోమని చెప్పి ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తుండడం ఎక్కువయ్యాయి. ఇదే అదనుగా భావించి విద్యార్థులు సైతం స్మార్ట్‌ఫోన్లను పాఠశాలకు తీసుకురావడం మొదలుపెట్టారు. తరగతి గదిలోనే ఫోన్లు మాట్లాడడం, ముచ్చట్లు పెట్టడం, అల్లరి చేయడంతో క్రమశిక్షణ తప్పింది. దీంతో పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం విధించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. విద్యార్థులు కూడా మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా కొన్ని షరతులు విధించింది. ఈ నిషేధం అమలు పర్యవేక్షణ బాధ్యతలను డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలకు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.


జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	1,918
చదువుతున్న విద్యార్థులు	63,311
ప్రాథమికోన్నత పాఠశాలలు	208
చదువుతున్న విద్యార్థులు	15,232
ఉన్నత పాఠశాలలు	352
చదువుతున్న విద్యార్థులు	85,358
మొత్తం పాఠశాలలు	2,478
మొత్తం విద్యార్థులు	1,63,901

హెచ్‌ఎం అనుమతితో

బయోమెట్రిక్ వేసిన వెంటనే హెచ్‌ఎం గదిలో, క్లర్క్ వద్ద మొబైల్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అత్యవసరం అయితే హెచ్‌ఎం అనుమతి తీసుకుని ఉపయోగించాలి. తరగతి గదుల్లో విద్యాబోధన కోసం ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు, స్మార్ట్‌టీవీలు, ట్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయులు ఉదయం తొమ్మిదిన్నరకు ముందు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే మొబైల్ వినియోగించాలి. ఒకవేళ అటెండెన్స్ తీసుకోవడం ఆలస్యం అయితే సంబంధిత హెచ్‌ఎం అనుమతితో సెల్‌ఫోన్ ఉపయోగించాలి. మొదటి సారి నిబంధనలు ఉల్లంఘిస్తే హెచ్‌ఎంకు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలి. రెండోసారి మండల విద్యాశాఖాధికారితో మాట్లాడిన తర్వాత మాత్రమే సెల్ ఫోన్ ఉపయోగించాలి. మూడోసారి అయితే ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను డీఈవోకు సరెండర్ చేయాల్సి ఉంటుంది. డీఈవోతో చర్చించిన తర్వాత మాత్రమే సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసి సెల్‌ఫోన్ తీసుకోవాల్సి ఉంటుంది. పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీల సమయంలో సెల్ ఫోన్ నిషేధం నిబంధనలు ఖచ్చితంగా అమలవుతున్నాయో లేదో చూడాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.


పకడ్బందీగా అమలుకు చర్యలు



ఉన్నతాధికారులు జారీచేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పాఠశాలల్లో సెల్‌ఫోన్‌ల నిషేధంపై జారీచేసిన ఉత్తర్వులను అన్ని మండలాల ఎంఈవోలకు, డీవైఈవోలకు పంపించాం. ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే చర్యలు చేపడుతాం. విద్యార్థులతో పాటు టీచర్లు సెల్‌ఫోన్ తరగతి గదుల్లో వినియోగించరాదు.

– విజయేంద్రరావు, డీఈవో, చిత్తూరు.

ఉత్తర్వుల అమలుకు సన్నాహాలు



పాఠశాలల్లో సెల్‌ఫోన్‌లను నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయనున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది. పాఠశాలల తనిఖీల సమయంలో టీచర్లు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్నట్లు కనిపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో బోధన అభ్యసన ప్రక్రియ సజావుగా సాగుతుంది.

– చంద్రశేఖర్, డీవైఈవో, చిత్తూరు

కారు ఢీకొని వ్యక్తి మృతి

పూతలపట్టు: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని ఆకనంబట్టు గ్రామానికి చెందిన వెంకటేష్(45) మండలంలోని తేజస్ డైరీ నుంచి ఇంటికి వెళ్లడానికి హైవే దాటుతుండగా తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా రామిరెడ్డి, అశ్వర్థ నాయక్ సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో వీరి చేత జేఈఓ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం వీరికి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.